www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

## వర్షాన్ని సైతం లెక్కచేయని ప్రజాసేవ!



4

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 278 శనివారం 07-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5

### మున్రేడువాగుపై రిటైనింగ్ వాల్ నిర్మాణానికి

## రూ.50.50 కోట్లు మంజూరు



3

- ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని మూడేళ్ల కృషి
- తొలగనున్న ఏళ్ల నాటి వరద ముప్పు భయాలు
- మున్రేడు వాగు వరద సమస్యకు శాశ్వత పరిష్కారం
- త్వరలోనే రిటైనింగ్ వాల్ పనులు ప్రారంభిస్తాం
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### తుఫాన్లతో రైతు కుదేలు.. ఆదుకోవడంలో

## కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం!

- పంట నష్టంపై గ్రామగ్రామాన సర్వే చేసి ఎకరాకు పరిహారం చెల్లించాలి
- రైతులకు న్యాయం చేయలేని సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి.. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్



3

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లలో

# ఇప్పపువ్వు టీ..

- ఆదివాసి మహిళల సంప్రదాయ ఉత్పత్తులకు పెద్దపీట..
- అడవి సంపదతో ఆదాయ మార్గాలు.. ఆది వాసి మహిళలకు ఉపాధి అవకాశాలు..
- ఇప్పపువ్వు స్టాళ్ల విస్తరణకు ప్రోత్సాహం.. మహిళలకు ప్రభుత్వ సహకారం..

**భద్రాద్రి న్యూస్ తాడ్వాయి**

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లలో ఇప్పపువ్వు టీని ప్రవేశపెట్టి, ఆదివాసి మహిళలు తయారు చేస్తున్న సంప్రదాయ ఉత్పత్తులకు విక్రయ అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. సొంతంగా ఇప్పపువ్వు స్టాళ్లు ఏర్పాటు చేసుకోవాలనుకునే మహిళలకు సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

శుక్రవారం తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో ప్రధాన రహదారి వద్ద ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండల సమాఖ్య కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, బ్యాంకు లింకేజీ ద్వారా ఏర్పాటు చేసిన ఇప్ప పువ్వు టీ స్టాళ్లను మంత్రి ప్రారంభించారు. మహిళలు తయారు

మిగతా 4లో..






4

## పేదరిక నిర్మూలనకు జీవనోపాధుల కల్పనే లక్ష్యం

**తాడ్వాయిలో గుర్తించిన వెయ్యి కుటుంబాలకు అండగా ప్రభుత్వం**

- రూ.33 వేల సహాయాన్ని ఆదాయ మార్గాలకే వినియోగించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క

### ఓటమి భయంతోనే ఓటర్ల జాబితాపై

## కాంగ్రెస్ దుష్ప్రచారం!

- మైండ్ గేమ్స్‌తో ప్రజలను మభ్యపెట్టలేరు..
- ఆధారాలుంటే బహిరంగ చర్చకు రావాలి..
- కాంగ్రెస్‌కు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సవాల్



2

## సింగరేణి పెన్షనర్లకు స్మార్ట్‌ఫోన్‌లోనే లైఫ్ సర్టిఫికెట్!

- డిజిటల్ సేవలతో మాజీ ఉద్యోగులకు ఇబ్బందులు దూరం..
- కొత్తగూడెం ఏరియాలో 200 మందికి పైగా పెన్షనర్లకు అవగాహన.. విజయవంతంగా సర్టిఫికెట్ల నవీకరణ



2

## గారపాటి సోమేశ్వరరావు మృతి తీరని లోటు

- **కేటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి మృతిపై మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శ..**
- **సేవా కార్యక్రమాల్లో ఆయన కృషిని స్మరించుకున్న నామ**

**ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 6 (భద్రాద్రిన్యూస్):**

కేటీపీఎస్ రిటైర్డ్ ఫోర్‌మెన్ గారపాటి సోమేశ్వరరావు మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సోమేశ్వరరావు మరణవార్త తెలుసుకున్న వెంటనే ఆయన కుమారుడు డాక్టర్ మురళికి ఫోన్ చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

ఈ సందర్భంగా సోమేశ్వరరావుతో తనకున్న అనుబంధాన్ని నామ నాగేశ్వరరావు గుర్తుచేసుకున్నారు. ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో వాకర్స్ తరఫున ప్రతిరోజూ మొక్కలకు బకెట్లతో నీరు పోస్తూ పచ్చదనం పరిరక్షణకు కృషి చేసేవారని తెలిపారు. అంతేకాకుండా పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తన సేవా నిరతిని చాటుకున్నారని కొనియాడారు. సోమేశ్వరరావు మృతి ఆయన కుటుంబానికే కాకుండా సేవా రంగానికి కూడా తీరని లోటని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



## జిల్లా యువజనోత్సవాల్లో హార్వెస్ట్ విద్యార్థినుల సృజనాత్మక విజయం!

- **కవితా రచనలో సాహితికి ప్రథమ స్థానం.. చిత్రలేఖనంలో జాహ్నవికి తృతీయ బహుమతి**
- **విజేతలను అభినందించిన కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతి రెడ్డి**

**ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 6 (భద్రాద్రిన్యూస్):-**

జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో హార్వెస్ట్ జూనియర్ కళాశాల విద్యార్థినులు తమ సృజనాత్మక ప్రతిభతో సత్తా చాటారు. కవితా రచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 5న ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో హార్వెస్ట్ విద్యార్థినులు విజయాలు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతి రెడ్డి వెల్లడించారు. ఈ పోటీల్లో హార్వెస్ట్ జూనియర్ కళాశాలకు చెందిన వల్లభనేని సాహితి కవితా రచన విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. అదేవిధంగా ప్రథమ సంవత్సరం విద్యార్థిని తాళ్లూరి జాహ్నవి చౌదరి చిత్రలేఖనం విభాగంలో తృతీయ బహుమతి కైవసం చేసుకుని తన కళాత్మక నైపుణ్యాన్ని చాటుకుంది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్య అంటే కేవలం పుస్తక పఠనం, పరీక్షల్లో మార్కులు సాధించడం మాత్రమే కాదని, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, సాహిత్యాభిరుచి, కళాత్మక నైపుణ్యాలను వెలికితీయడం కూడా విద్యాసంస్థల బాధ్యత అని పేర్కొన్నారు. కవిత్వం ద్వారా భావాలను వ్యక్తీకరించడం, చిత్రలేఖనం ద్వారా ఊహలకు రూపమివ్వడం విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడతాయని తెలిపారు. విద్యార్థినులు సాధించిన విజయాలు తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన అధ్యాపకులను సైతం ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# సింగరేణి పెన్షనర్లకు స్మార్ట్‌ఫోన్‌లోనే లైఫ్ సర్టిఫికెట్!

- **డిజిటల్ సేవలతో మాజీ ఉద్యోగులకు ఇబ్బందులు దూరం..**
- **కొత్తగూడెం ఏరియాలో 200 మందికి పైగా పెన్షనర్లకు అవగాహన.. విజయవంతంగా సర్టిఫికెట్ల నవీకరణ**



**కొత్తగూడెం సింగరేణి , నవంబర్ 6 (భద్రాద్రిన్యూస్):-**

సింగరేణి మాజీ ఉద్యోగులు, పెన్షనర్లకు డిజిటల్ సేవలను మరింత చేరువ చేసేందుకు చేపట్టిన డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 5.0 అవగాహన కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా సింగరేణి కొత్తగూడెం ఏరియా, బొగ్గు గనుల భవిష్య నిధి సంస్థ (సీఎంపీఎఫ్) సంయుక్తంగా రుద్రంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించాయి. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్ వెంటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్1 వంశీధర్ కుసుంబ, రీజినల్ కమిషనర్2 ఎం. కన కమ్మ, అసిస్టెంట్ కమిషనర్ పి. చిరంజీవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జీఎం సీహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ.. గతంలో లైఫ్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేసుకునేందుకు మాజీ ఉద్యోగులు పలుమార్లు నెట్ సెంటర్లకు వెళ్లి ఇబ్బందులు పడేవారని తెలిపారు. పెన్షనర్లు తమ స్మార్ట్‌ఫోన్ల ద్వారానే జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించుకునే సౌకర్యాన్ని కల్పిస్తూ ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేసిన సీఎంపీఎఫ్ సంస్థకు, సంబంధిత అధికారుల బృందానికి సింగరేణి మాజీ ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం సీఎంపీఎఫ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మొబైల్ యాప్‌లో జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్‌ను ఎలా నమోదు చేయాలి, నవీకరించాలి అనే అంశాలపై పెన్షనర్లకు వివరించారు. ఇకపై కార్యాలయాలు, నెట్ సెంటర్ల చుట్టూ తిరగకుండా తమ మొబైల్ ఫోన్లలోనే లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించుకోవచ్చని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఉద్యోగులు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. మొబైల్‌లోనే లైఫ్ సర్టిఫికెట్‌ను నవీకరించుకునే విధానాన్ని తెలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

కొత్తగూడెం ఏరియాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా సీఎంపీఎఫ్ పెన్షనర్లు, సీపీఆర్ఎంఎస్ కార్డుదారులు పాల్గొని తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను విజయవంతంగా నవీకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ కె. రాములు, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, ఎస్ఓటు జీఎం ఎం. గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ జి. హరీష్, సీనియర్ పీఓ మజ్జి మురళి, వివిధ గనులు, విభాగాల సంక్షేమ అధికారులు, సిబ్బంది, కొత్తగూడెం ఏరియా పర్సనల్ విభాగం సిబ్బంది, సీఎంపీఎఫ్ అధికారులు, మాజీ సింగరేణి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ దుష్ప్రచారం!

- **మైండ్ గేమ్స్‌తో ప్రజలను మభ్యపెట్టలేరు..**
- **ఆధారాలుంటే బహిరంగ చర్చకు రావాలి..**
- **కాంగ్రెస్‌కు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సవాల్**

**కొత్తగూడెం అర్బన్, నవంబర్ 6 (భద్రాద్రిన్యూస్):**

ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై నిరాధార ఆరోపణలు చేస్తోందని బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా జరుగుతున్న ఎన్నికల ప్రక్రియపై బురదజల్లడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

శుక్రవారం కొత్తగూడెంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లను తొలగించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న సవరణ ప్రక్రియను కాంగ్రెస్ నాయకులు తప్పుబట్టడం సరికాదన్నారు. గతంలో జరిగిన అక్రమాలు, బోగస్ ఓట్లు బయటపడతాయనే భయంతోనే కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారానికి తెరలేపుతున్నారని ఆరోపించారు.

రాజ్యాంగ వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు వ్యవస్థలు సక్రమంగా ఉన్నాయని, ఓటమి ఎదురయ్యే పరిస్థితి వచ్చినప్పుడు ఎన్నికల సంఘం, ఈవీఎంలపై ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. ఇది ఆ పార్టీ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు.



**దమ్ముంటే ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలి**

కాంగ్రెస్ నాయకులకు తమ ఆరోపణలపై నిజంగా నమ్మకం ఉంటే గాలిమాటలు మానుకుని, తగిన ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సవాల్ విసిరారు. ఓటర్ల జాబితా సవరణలో ఎక్కడ అక్రమాలు జరిగాయో నిరూపించాలని, నిరూపించలేకపోతే ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజలు అమాయకులు కారని, కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ కుట్రలు, మైండ్ గేమ్స్, గందరగోళ ప్రచారాన్ని నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రతి గడపకూ వెళ్లి కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలకు వివరిస్తాయని తెలిపారు.

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిరసనగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజల ముందు ఆ పార్టీ వైఖరిని ఎండగడతామని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు నవీన్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు బలగం శ్రీధర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు మోహన్ కృష్ణ, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కోల హరీష్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు మంగీలాల్ నాయక్, ఎస్సీ మోర్చా కార్యదర్శి మహంకాళి శంకర్, సబ్బాని రాజేష్, లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి పవన్, ముకుంద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# దీపంలా ఒక్కటైన విద్యార్థులు.. సురక్షిత దీపావళే త్రివేణి ఆకాంక్ష

- **హ్యాపీ అండ్ సేఫ్ దీపావళికి పిలుపు**

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 6 (భద్రాద్రిన్యూస్) :-**

దీపావళి పండుగను పురస్కరించుకుని ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో ముందస్తు వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ కలిసి పాఠశాల ఆవరణలో దీపం ఆకారంలో నిలబడి అందరినీ ఆకట్టుకున్నారు. చేతులు పైకెత్తి “హ్యాపీ అండ్ సేఫ్ దీపావళి” అంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సురక్షితంగా, పర్యావరణ హితంగా దీపావళి జరుపుకోవాలని సందేశమిచ్చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ పండుగలను ఆనందంతో పాటు సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని జరుపుకోవాలని సూచించారు.



ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ విద్యార్థుల సృజనాత్మక తను అభినందిస్తూ అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని సి.ఆర్.ఓ కాట్రగడ్డ ముని తెలిపారు.

రళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# యాదవ ప్రముఖులకు చిత్తారు వారి వివాహ ఆహ్వానాలు

- **హైదరాబాద్‌లో పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులకు పెళ్లి శుభలేఖలు అందజేత**
- **చిత్తారు సింహాద్రి యాదవ్, మేకల మల్లిబాబు యాదవ్ ఆధ్వర్యంలో ఆహ్వాన కార్యక్రమం**

**ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 6 (భద్రాద్రిన్యూస్):-**



అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్ - మాధవి దంపతుల కుమార్తె జోషిత వివాహం గురునాథ్‌తో ఈ నెల 15వ తేదీ ఆదివారం ఖమ్మంలోని బోనకల్ రోడ్డులో ఉన్న లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో జరగనుంది. ఈ వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ యాదవ సామాజిక, రాజకీయ ప్రముఖులకు వివాహ ఆహ్వాన పత్రికలు అందజేశారు. జిల్లా అఖిల భారత యాదవ మహాసభ గౌరవాధ్యక్షుడు, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, చిత్తారు సింహాద్రి యాదవ్‌తో కలిసి హైదరాబాద్‌లో పలువురు ప్రముఖులను వ్యక్తిగతంగా కలిసి వివాహానికి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గం మల్లేష్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్, ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్, యాదవ ఫెడరేషన్ చైర్మన్ రఘురాం యాదవ్, మాజీ అధ్యక్షులు బద్దుల బాబురావు, బద్దుల ప్రశాంత్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, గొర్రెలు, మేకల ఫెడరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వాకదాని పుల్లారావు యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ గంగదేవుల లోకేష్ యాదవ్, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సేవెల సంపత్ తదితరులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తుప్పాతి రవి, ఉరిబెండి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముర్రేడువాగుపై రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.50.50 కోట్లు మంజూరు



- **ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని మూడేళ్ల కృషి**
- **తొలగనున్న ఏళ్ల నాటి వరద ముప్పు భయాలు**
- **ముర్రేడు వాగు వరద సమస్యకు శాశ్వత పరిష్కారం**
- **త్వరలోనే రిటైనింగ్ వాల్ పనులు ప్రారంభిస్తాం**
- **కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**కొత్తగూడెం అర్బన్ , నవంబర్ 6 (భద్రాద్రిన్యూస్):-**





ముర్రేడు వాగు వరద ముప్పునకు శాశ్వత పరిష్కారం చూపుతూ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.50.50 కోట్ల నిధులు మంజూరు చేసిందని, మూడేళ్లుగా తాను చేసిన కృషికి ఫలితం లభించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మానానికి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అనుమతులు మంజూరుచేయడంతోపాటు వెనువెంటనే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నిధులు మంజూరు ఉత్తర్వులు జారీ చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జనావాసాల మధ్య నుండి పారుతున్న ముర్రేడు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మించడంలో గత పాలకులు పూర్తిగా విఫలం చెందారని అన్నారు. ఏళ్ల తరబడి ముర్రేడు వాగు ఉధృతి వల్ల శ్రీనగర్, ప్రశాంతి నగర్, సాయినగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, భారీ వర్షాలకు వరద నీరు ఇండ్లలోకి చేరి ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపారని గుర్తుచేశారు. గత పాలకులు ఈ సమస్యను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో దశాబ్దాలుగా ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీశారని పేర్కొన్నారు. శ్మశాన వాటికలకు వెళ్లే మార్గాలు సైతం మునిగిపోయి ప్రజలు నరకయాతన అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల బాధలను గుర్తించి ట్రైనింగ్ వాల్ నిర్మాణమే శాశ్వత పరిష్కారమని, అందుకోసం మంత్రులపై వత్తిడి తెచ్చి సాధించానన్నారు. ఫలితంగానే ముర్రేడు వాగుకు ఇరువైపులా పటిష్టమైన రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని స్పష్టం చేశారు. ఈ రక్షణ గోడతో ముంపు ప్రాంతాల ప్రజలకు వరద ముప్పు నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కట్టుబడి ఉంటానని కూనంనేని స్పష్టం చేశారు.

# మహిళలు రుణాలను వ్యాపార పెట్టుబడులుగా వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలి

- **రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**భద్రాద్రి న్యూస్ గోవిందరావుపేట**

మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలను వ్యాపార పెట్టుబడులుగా వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు.

శుక్రవారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండల సమాఖ్య కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ఏర్పాటు చేసిన కాజా బటన్ మిషన్ యూనిట్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం గోవిందరావుపేట మండల కేంద్రంలో కనకదుర్గ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జనరల్ రిసోర్సెస్ సెంటర్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాజా బటన్ మిషన్ యూనిట్లు, గాజులు, కిరాణా, కూరగాయలు, వస్త్ర దుకాణాలు వంటి వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించి, రుణాలు తిరిగి చెల్లించడంతోపాటు మరో వ్యాపారాన్ని ప్రారంభించే స్థాయికి మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా విస్తృత అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

మహిళా సంఘాలకు దాదాపు రూ.73 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాలకు జమ కావాల్సిన వడ్డీ మొత్తాలను త్వరలోనే వారి ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 8న కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నూతన పించన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్లతో రైతు కుదేలు.. ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం!

- **పంట నష్టంపై గ్రామగ్రామాన సర్వే చేసి ఎకరాకు పరిహారం చెల్లించాలి**
- **రైతులకు న్యాయం చేయలేని సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి..**
- **మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్**

**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 6 (భద్రాద్రిన్యూస్):**

వరుస తుఫాన్ల ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంటలు చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీశాయని బీఆర్ఎస్ మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ అధ్యక్షుడు రేగా కాంతారావు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సంభవించిన అర్నబ్, మురాసు తుఫాన్ల కారణంగా వరి, పత్తి, మిర్చి తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఒకవైపు తుఫాన్లతో పంటలు నష్టపోతుంటే, మరోవైపు సాగునీరు అందక, సరైన విద్యుత్ సరఫరా లేక అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లేసిన రైతులకు నేడు కన్నీళ్లే మిగిలాయని విమర్శించారు. రైతుబంధు సకాలంలో అందకపోవడం, సాగునీటి కొరత, వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. చివరకు రైతులు పంటలు వేయొద్దంటూ క్రాప్ హాలిడేలు ప్రకటించే పరిస్థితి రావడం, పంటలు సాగు చేస్తే స్వీయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశామని గుర్తుచేశారు. ఆనాడు రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని, నేడు కాంగ్రెస్ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రజలు గమనించాలని సూచించారు. ప్రభుత్వ పనితీరును ఎన్నికల హామీలతో కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు అందుతున్న ప్రయోజనాలతో అంచనా వేయాలని అన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో, వారి సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతుల కష్టాలను పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిలో కొనసాగేందుకు నైతిక హక్కు కోల్పోయారని, తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**గ్రామగ్రామాన పంట నష్టం సర్వే చేపట్టాలి**

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో ప్రతి గ్రామంలో సమగ్ర పంట నష్టం సర్వే నిర్వహించాలని రేగా కాంతారావు డిమాండ్ చేశారు. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు తగిన పరిహారం చెల్లించాలని కోరారు. కేవలం తుఫాన్ల వల్ల నష్టపోయిన వారినే కాకుండా, సాగునీరు అందక, విద్యుత్ సరఫరా లోపాలతో పంటలు ఎండిపోయిన రైతులను కూడా గుర్తించి ప్రత్యేక పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య వ్యవసాయ రంగంలో ఉన్న వ్యత్యాసాన్ని రైతులు, ప్రజలు, మేధావులు బేరీజు వేసుకోవాలని సూచించారు. ఎన్నికల హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న విధానాలు, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను పరిశీలించాలన్నారు.

రైతులకు భరోసా కల్పించి, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా సంక్షేమ పాలన అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగాన్ని తక్షణమే అన్ని విధాలా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రేగా కాంతారావు డిమాండ్ చేశారు.



# రామప్ప శిల్పకళ.. నాటి సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం

- కాకతీయుల నిర్మాణ కౌశలం అద్భుతం
- ప్రసాద్ పథకం పనుల వివరాలను అడిగి తెలుసుకున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
- రామప్ప దేవాలయాన్ని సందర్శించిన రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఐఏఎస్

భద్రాద్రి న్యూస్ ములుగు

రామప్ప దేవాలయ శిల్పకళ, నిర్మాణ కౌశలం నాటి సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. కాకతీయుల కాలం నాటి ఇంజినీరింగ్ పరిజ్ఞానం, ఆలయ నిర్మాణంలో అనుసరించిన పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.

శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి సందర్శించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ శాలువాలతో సన్మానించారు.

ఈ సందర్భంగా పర్యాటక మార్గదర్శి గోరంట్ల విజయ్ కుమార్ కాకతీయుల చరిత్ర, రామప్ప ఆలయ నిర్మాణ విశేషాలు, శిల్పకళా వైభవాన్ని వివరించారు. నీటిలో తేలియాడే ఇటుకలు, ఆలయ నిర్మాణంలో ఉపయోగించిన డోలరైట్, బసాల్ట్, ఇసుకరాయి, సాండ్‌బాక్స్ సాంకేతికత గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఆలయంలోని శిల్పాలను పరిశీలిస్తూ, ఆలయ చరిత్ర, నిర్మాణ ప్రత్యేకతలపై జిల్లా కలెక్టర్‌తో చర్చించారు.

శిల్పి పేరుతో ఆలయం ప్రాచుర్యం పొందడం రామప్ప ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఆలయ శిల్పాల్లో చరిత్ర, పురాణాలతోపాటు నాటి వస్త్రధారణ, కళలు, ఆటలకు సంబంధించిన అంశాలను ప్రతిబింబించిన తీరు విశేషమని అన్నారు. ఆనాటి జీవన విధానాన్ని, కళా వైభవాన్ని శిల్పాల రూపంలో భవిష్యత్ తరాలకు అందించిన వారసత్వ సంపద అమోఘమని కొనియాడారు.

అనంతరం ప్రసాద్ పథకం కింద చేపడుతున్న నిర్మాణ పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా ఆలయ పరిసరాల్లో భక్తులు, పర్యాటకుల కోసం కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీఓ రాజు, ఎస్సై రాజు, డిప్యూటీ రేంజ్ అధికారి మధుబాబు, ఆర్ఐ రమేష్, జీపీఓ సూరయ్య, పర్యాటక పోలీసులు దశరథ్, శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్, బద్రు, రెవెన్యూ, పోలీసు, అటవీ, పురావస్తు, దేవాదాయ, పర్యాటక శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# పేదరిక నిర్మూలనకు జీవనోపాధుల కల్పనే లక్ష్యం

- తాడ్వాయిలో గుర్తించిన వెయ్యి కుటుంబాలకు అండగా ప్రభుత్వం
- రూ.33 వేల సహాయాన్ని ఆదాయ మార్గాలకే వినియోగించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క



భద్రాద్రి న్యూస్ తాడ్వాయి

పేద కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధులు కల్పించి, పేదరికం నుంచి బయటకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.

శుక్రవారం తాడ్వాయి మండలంలోని రైతువేదికలో సమ్మక్క-సారక్క మండల సమాఖ్య, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్, తెలంగాణ ఇన్‌క్లూసివ్ లైవ్‌లీహుడ్స్ ప్రోగ్రామ్ టీజీఐఎల్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి జీవనోపాధుల కార్యక్రమానికి మంత్రి సీతక్క ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు వివిధ జీవనోపాధి పథకాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రత్యేక సహాయం కోసం ఎంపిక చేసిన ఎనిమిది మండలాల్లో ములుగు నియోజకవర్గానికి చెందిన తాడ్వాయి, కన్నాయిగూడెం, గంగారం మండలాలు ఉన్నాయని తెలిపారు. ఆదివాసులు, దళితులు, ఇతర పేద వర్గాలు అధికంగా నివసించే ఈ ప్రాంతాల్లో మహిళా సంఘాల ద్వారా అవసరమైన కుటుంబాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. తాడ్వాయిలో ఎంపిక చేసిన వెయ్యి కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా కృషి చేస్తున్నామని, ఈ కార్యక్రమం విజయవంతమైతే మరిన్ని మండలాలకు విస్తరించే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఒక్కో కుటుంబానికి అందిస్తున్న రూ.33 వేల విలువైన సామగ్రి, ఆర్థిక సహాయాన్ని ఆదాయం సమకూర్చే పనులకే వినియోగించాలని మంత్రి సూచించారు. దుకాణాలు, ఇతర జీవనోపాధులకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసుకోవాలని, వ్యక్తిగత ఖర్చులకు మళ్లించవద్దని కోరారు. వర్షాకాలంలో విత్తనాలు అందించామని, ఇటీవల ఐలాపురం గ్రామానికే దాదాపు రూ.33 లక్షల సహాయం అందించినట్లు తెలిపారు. పండుగ సందర్భంగా రూ.వెయ్యి విలువైన 14 రకాల నిత్యావసర వస్తువులను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంపిక చేసిన కుటుంబాలకు అర్హత మేరకు ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, పింఛన్లు, ఉపాధి హామీ జాబ్‌కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు గుర్తించి పరిష్కరించాలని, అందించిన సహాయం వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఉపయోగపడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో 86 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.7 కోట్లు, తేనెటీగల పెంపకానికి రూ.1,12,95,985, తెలంగాణ ఇన్‌క్లూసివ్ లైవ్‌లీహుడ్స్ ప్రోగ్రామ్ టీజీఐఎల్‌పీ కింద రూ.1 కోటి 26 లక్షలు, ఆరు గ్రామాల్లో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్‌కు రూ.40 లక్షలు, వెదురు మొక్కల పెంపకానికి రూ.8 లక్షల 10 వేలు, ఇంటిగ్రేటెడ్ లైవ్‌స్టాక్ యాక్టివిటీకి రూ.3 లక్షలు, కాజా బటన్ మిషన్ యూనిట్‌కు రూ.1 లక్ష 80 వేలతోపాటు పీఎంఎఫ్ఎంఈ సీడ్ క్యాపిటల్ కింద పిండి గిర్నీల నిర్వహణకు సంబంధించిన ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి సీతక్క, ఐ టి డి ఏ పి ఓ తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లలో ఇప్పపువ్వు టీ..

మొదటిపేజీ తరువాయి

చేస్తున్న ఇప్పపువ్వు ఉత్పత్తులను పరిశీలించి, ఇప్పపువ్వు టీని రుచి చూశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్థానికంగా లభించే ఇప్పపువ్వుతో టీ, లడ్డూలు, పౌడర్ వంటి ఉత్పత్తులను తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదివాసి మహిళలకు ఆదాయ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అటవీ ఉత్పత్తులను సేకరించి విక్రయించడంతోపాటు వాటికి అదనపు విలువ జోడించే ఉత్పత్తుల తయారీని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

మండల సమాఖ్యల పరిధిలో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లలో ఇప్పపువ్వు టీని అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. ఆయా క్యాంటీన్లకు మహిళలు ఇప్పపువ్వు ఉత్పత్తులను సరఫరా చేసేలా అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారం నిర్వహించాలనుకునే మహిళలకు కూడా సహకరిస్తామని తెలిపారు.

మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు స్థానిక వనరులను వినియోగించుకొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. ఇప్పపువ్వును పౌడర్‌గా తయారు చేసి టీలో వినియోగిస్తున్న మహిళల కృషిని అభినందించారు. ఆదివాసి మహిళల సంప్రదాయ నైపుణ్యాలను స్థిరమైన ఆదాయ మార్గాలుగా మలుచుకునేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు, ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మతం పేరుతో మహిళలపై దాడులు అమానుషం

- **మతం పేరుతో మహిళలపై దాడులు అమానుషం**
- **అల్మాజ్ గూడ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను శిక్షించాలి**
- **సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్**



**భద్రాద్రి న్యూస్ పెద్దపల్లి నవంబర్ 6:**

అల్మాజ్ గూడలో ఇద్దరు క్రైస్తవ మహిళలపై జరిగిన దాడిని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా నాయకులు చీమల ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతం పేరుతో మహిళలపై దాడులకు పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కల్పించిన మత స్వేచ్ఛను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఇతరుల మత విశ్వాసాలను ప్రశ్నించే పేరుతో దాడులకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. బుద్ధుడు, ఫూలే, అంబేడ్కర్ బోధించిన సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవత్వానికి మత విద్వేషాలు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముడిమడుగుల సురేష్, జిమ్మిడి అశోక్, జిమ్మిడి శాంతికుమార్, రామటెంకి విశ్వనాథ ప్రతాప్, బెక్కెం నిఖిల్ సాయి, హరక్షిత తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు

- **విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**
- **జన్మదిన వేడుకల సందర్భంగా వనవాసీ విద్యార్థి నిలయాలకు లక్ష్మణాచారి చేయూత**



**చర్ల, నవంబర్ 6 (భద్రాద్రి న్యూస్):**

విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసిస్తూ తమలోని ప్రతిభా సామర్థ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని చర్ల హనుమాన్ జ్యూయలరీస్ ప్రొప్రైటర్ తంగిళ్లపల్లి లక్ష్మణాచారి పిలుపునిచ్చారు. చదువుతోనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చగలమని సూచించారు.

తన జన్మదినాన్ని పురస్కరించుకుని చర్లలోని వనవాసీ శబరి బాలికా నిలయం, కొమరం భీం విద్యార్థి నిలయాలకు 50 కేజీల బియ్యం, 45 వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, పండ్లను అందజేశారు.

శబరి బాలికా నిలయం కార్యదర్శి బందా స్వరూపరాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మణాచారి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి, దాతల సహకారంతో వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్న నిలయ కమిటీ సభ్యుల సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని సూచించారు.

విద్యార్థుల క్రమశిక్షణ, సంస్కారవంతమైన ప్రవర్తన, శ్లోకాలను అద్భుతంగా పఠించే విధానం దాతలను ఆకర్షిస్తున్నాయని పేర్కొన్నారు. వారి ప్రతిభను గుర్తించి పలువురు దాతలు స్వచ్ఛందంగా సహాయం చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. దాతలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ విద్యార్థి నిలయాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జీవితంలో స్థిరపడాలంటే విద్య ఒక్కటే ప్రధాన మార్గమని, తమ కోసం కష్టపడుతున్న తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలంటే కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని హితవు పలికారు.

వనవాసీ కళ్యాణ పరిషత్ దేశవ్యాప్తంగా గిరిజన విద్యార్థుల అభ్యున్నతి కోసం పలు వసతి గృహాలను ఏర్పాటు చేసి విద్యా సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, కొమరం భీం నిలయం కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటీ సభ్యులు పోలిన రమాదేవి, సుజాత, నిలయ ప్రముఖ్ వరలక్ష్మి, లక్ష్మణాచారి మిత్రులు ముదిగొండ సతీష్, కొండేటి చంద్రశేఖర్, కొట్ర సంపత్ కుమార్, చల్లా పవన్, ముత్యాల సతీష్, చింతల శ్రీనివాస్, బత్తుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద సంఘ సభ్యులకు వీఆర్ఎఫ్ ఆర్థిక భరోసా!

- **అర్హులైన లబ్ధిదారులకు రూ.86 వేల చెక్కుల పంపిణీ**
- **ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు చేయూత.. అర్హతే ప్రామాణికంగా ఆర్థిక సాయం అందించడమే లక్ష్యం: విజేత VO అధ్యక్షురాలు కణితి రజిని**

**చర్ల అక్టోబర్ 6 (భద్రాద్రి న్యూస్):**

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద సంఘ సభ్యులకు అండగా నిలిచేందుకు వీఆర్ఎఫ్ (VRF) నిధుల ద్వారా ఆర్థిక సహాయం అందించారు. ఆర్. కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని దానవాయిపేటలో అర్హులైన సంఘ సభ్యులకు మొత్తం రూ.86 వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అత్యవసర సమయంలో చేయూత అందించాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. వీఆర్ఎఫ్ నిధుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో నిజమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని గుర్తించి, వారి పరిస్థితులను పరిశీలించిన అనంతరం అర్హులకు సాయం అందజేశారు.

ఈ సందర్భంగా విజేత VOA సమీమునిశ బేగం, విజేత VO అధ్యక్షురాలు కణితి రజిని చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులను అందించారు. అనంతరం కణితి రజిని మాట్లాడుతూ.. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద సంఘ సభ్యులకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే వీఆర్ఎఫ్ నిధుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్థిక సహాయం అందించడంలో పారదర్శకత పాటించాలని తెలిపారు. లబ్ధిదారులు అందుకున్న నిధులను అనవసర ఖర్చులకు వినియోగించకుండా తమ కుటుంబ అవసరాలకు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు.

పేదలకు అందాల్సిన ఆర్థిక సాయం నిజమైన అర్హులకే చేరినప్పుడే ప్రభుత్వ సంక్షేమ లక్ష్యం నెరవేరుతుంది. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఇలాంటి ఆర్థిక చేయూత మరింత మందికి అందాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, వీవో సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# టీబీపై నిర్లక్ష్యం వద్దు.. అనుమానం ఉంటే వెంటనే పరీక్షలు!

- **మొగళ్ళపల్లిలో ఉచిత ఎక్స్‌రే శిబిరం.. 65 మందికి పరీక్షలు**
- **ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం.. టీబీ నివారణపై ప్రజలకు వైద్యాధికారుల అవగాహన**



**చర్ల, నవంబర్ 6 (భద్రాద్రి న్యూస్):**

టీబీ వ్యాధిపై ప్రజలు అపోహలు వీడి, ముందస్తు పరీక్షలతో వ్యాధిని గుర్తించి తగిన చికిత్స పొందాలని వైద్యాధికారులు సూచించారు. వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసుకోవచ్చని స్పష్టం చేశారు.చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొగళ్ళపల్లి గ్రామంలో టీబీ వ్యాధి నిర్ధారణ కోసం నిర్వహిస్తున్న ఎక్స్‌రే పరీక్షల శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోనే విలువైన ఎక్స్‌రే పరికరంతో పరీక్షలు నిర్వహించే అవకాశం కల్పించడం సంతోషకరమని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో మొత్తం 65 మంది ఎక్స్‌రే పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు.

టీబీ వ్యాధి నిర్ధారణ అయినంత మాత్రాన ఎవరూ భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఇది ఎవరికైనా వచ్చే వ్యాధేనని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీకి పూర్తిస్థాయి చికిత్స ఉచితంగా అందుబాటులో ఉందని, వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హారిక మాట్లాడుతూ.. శరీరంలోని దాదాపు అన్ని అవయవాలకు టీబీ సోకే అవకాశం ఉందని, వ్యాధి లక్షణాలపై ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. టీబీ రోగులకు ఉచితంగా మందులు అందించడంతో పాటు, చికిత్స పొందుతున్న కాలంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి నెలా రూ.1,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. సరైన పోషకాహారం తీసుకుంటూ, మందులను మధ్యలో ఆపకుండా క్రమం తప్పకుండా వాడితే టీబీని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు.అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్లైడే డ్రై డే కార్యక్రమాన్ని వైద్యాధికారులు పరిశీలించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మొగళ్ళపల్లి సర్పంచ్ సత్యవతి, ఉపసర్పంచ్ ఎర్ర రామదాసు, పంచాయతీ కార్యదర్శి నవీన్, టీబీ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, ఎక్స్‌రే టెక్నీషియన్ శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజర్ సీతారామయ్య, హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు నరసింహ, ధర్మ, స్వరాజ్యం, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.